19న అయ్యప్ప మహాపడిపూజ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పార్వతీరామలింగేశ్వరాలయంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడి పూజను నిర్వహిస్తున్నట్లు గురుస్వామి రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గురుస్వాములు మున్ను నాయుడు చేతుల మీదుగా నిర్వహించే మహాపడి పూజలో నార్సింగి నర్సింగ్‌రావు భజన, భాగ్యమ్మ, లత, నాగేష్, రితేష్‌ల చేత అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

రాజేంద్రనగర్: నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న హెమా జిల్లోజు అన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల సందర్భంగా హెల్మెట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. విద్యార్థులు లేరని మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరిపిస్తానని, డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానన్నారు. పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావుల ఆత్మహత్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ !

- బస్తీ దవాఖాన ఎదుటే ఏర్పాటు చేసిన వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: గత కొన్నేళ్లుగా బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మధ్యలో అడ్డుగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్‌లో బస్తీ దవాఖాన ఎదుట భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లేందుకు స్థానికులు బయపడుతున్నారు.

ప్రమాదాలు జరగకముందే..

ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. పక్కనే ఉన్న నర్సాబాయి కుంటలో పశువులు మేతమేయడానికి వస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలిన ప్రమాదం



బస్తీ దవాఖాన ఎదుట ప్రమాదకరంగా ఇలా..

చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

◆ బస్తీలో అనారోగ్యంతో దవాఖానకు వచ్చే వృద్ధులు, మహిళలు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం పట్ల విద్యుత్ అధికారులపై మండిపడుతున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ వైర్లు వేడెక్కి నిప్పులు కిందపడుతున్నాయని వైద్యురాలు సైతం దవాఖానకు తాళం వేసుకుని వెళ్లిన సందర్భాలున్నాయి. ముందస్తు జాగ్రత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. పక్కనే ఉన్న నర్సాబాయి కుంటలో ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మధ్యలో ఉండటంతోనే ఇబ్బందులు



మార్కండేయనగర్ బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ మధ్యలో ఉండటంతో మా బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీ దవాఖానకు వచ్చే రోగులు, మహిళలు, చిన్నారులు అటు నుంచి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ ఐనప్పుడు నిప్పు రవ్వలు బయటపడుతున్నాయి. అధికారులు మా సమస్యను గుర్తించి ట్రాన్స్ ఫార్మర్‌ను ఇక్కడి నుండి తొలగించాలని కోరుతున్నాం.

– రమేష్, మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించండి

అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



బోటిగూడ ఎన్నికల ప్రచారంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యంతో అభివృద్ధి కుంటుపడిందని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని రామంజాపూర్, బోటిగూడ, మల్కారం, రామంజాపూర్‌తండా, సుల్తాన్‌పల్లిలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ.. ఈ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాష్‌గౌడ్ అభివృద్ధిని మరిచారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో బీజేపీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కరపత్రాల పంపిణీ

రాజేంద్రనగర్: బుద్వేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ గెలుపుకోసం శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తూ.. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. జిల్లా పార్టీ కార్యదర్శి కోరని బాల్‌రాజ్, డివిజన్ అధ్యక్షులు బొక్కా ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.దయానంద్, సామ రాజ్‌పాల్‌రెడ్డి, కోరని శ్యామ్, నరేందర్, ప్రకాష్, కే.ఎస్.రాజ్‌కుమార్, శ్రీధర్, నారాయణ, దానయ్య, నర్సింగ్‌రావు, కుమార్, సదానందం, అంశమ్మ, రఘూన్సీ, బాలు, రాజు, మసూద్ పటేల్ తదితరులున్నారు.

ఏడాదిలోపే అభివృద్ధికి శ్రీకారం

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బండ్లగూడ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: గత 60 ఏళ్ల పాలించిన ప్రభుత్వాలు చేయలేని పనులను సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే, అది కూడా ఏడాదిలోపే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు నియోజకవర్గంలో నాల్గోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ఓల్డ్ విలేజ్, ప్రశాంత్‌నగర్ కాలనీ, పోచమ్మ దేవాలయం, మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ.. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరి బతుకులు మారాయన్నారు.

◆ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో జరగాలన్నా.. పేద ప్రజల అభ్యున్నతి జరగాలన్న అది బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్‌లోని మూడు మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తామన్నారు.

◆ నియోజకవర్గానికి ఒక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు సైతం చర్యలు ప్రారంభించామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతామన్నారు.

◆ ప్రజలంతా మరోసారి తనను ఆశీర్వదించి బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా రాందాస్, కార్పొరేటర్లు లతాప్రేమ్‌గౌడ్, సాగర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, శ్రీనాథ్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మావతిపాపయ్యయాదవ్, నిఖిలసంగారెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, మాజీ సర్పంచ్ యాదయ్య, ప్రేమ్‌కుమార్‌గౌడ్, నాగరాజు, గోపాల్‌ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, జగదీష్, సాయిబాబాగౌడ్, నర్సింహ్మాగౌడ్, ప్రభాకర్‌గౌడ్, రాజు, పాండు, సయ్యద్‌ఖాజా, రజాక్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శంషాబాద్: పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సులకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బ్యూటీషియన్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు కనీసం విద్యార్హత ఏడోతరగతి, ఎంఎస్ ఆఫీస్ కోర్సుకు పదోతరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు మూడు నెలల పాటు శిక్షణను అందించనున్నట్లు కేంద్రం ఇన్‌చార్జ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఉన్న శిక్షణ కేంద్రంలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 9440788502.

నాసా పోటీలకు విద్యార్థుల ఎంపిక

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నాసా నిర్వహించనున్న స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.కే.దాస్ అన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఆయన కిట్లను అందజేశారు. నాసా నిర్వహించే పోటీల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఏజీఎం కృష్ణ, కో–ఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ నరేష్, ఇన్‌చార్జ్ యాదగిరి, నాసా పరీక్షల ఇన్‌చార్జ్ రంజిత్ తదితరులున్నారు.

'జీవో 111 ఎత్తివేత బూటకం'

శంషాబాద్: ప్రభుత్వం చెబుతున్నట్లుగా జీవో 111 ఎత్తివేత ఎక్కడ జరిగిందని ఊట్‌పల్లి కౌన్సిలర్, బీజేపీ సీనియర్ నాయకులు కె.ప్రవీణ్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జీవో 111 ఎత్తివేత కేవలం మాటలకే పరిమితమైందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణకు నోచుకున్న దాఖలాలు లేవన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని బీఆర్‌ఎస్ నేతలు ఏం మోహం పెట్టుకుని ఓట్లు అడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థికి భారీ మెజార్టీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, దేవేందర్, భాస్కర్‌రెడ్డి, జగ్జీవన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, అరుణ్, మల్లారెడ్డి తదితరులున్నారు.

నిజాయితీగా అభివృద్ధి పనులు

అత్తాపూర్: నీతి నిజాయితీకి మారుపేరుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేత మామిడి సుధాకర్‌రెడ్డి, సుల్గే వెంకటేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అత్తాపూర్ డివిజన్‌లోని నందిముస్లాయిగూడ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్టార్ రాజు, ఎస్.వెంకటేష్, వెంకట్‌రెడ్డి, ఎం.సుధాకర్ రెడ్డి, జిత్తు సింగ్, కార్తీక్ రెడ్డి, సందీప్ రెడ్డి, విజయ్‌స్వామి, యశ్వంత్‌రెడ్డి, రాము, అక్షయ్, శివ తదితరులున్నారు.

దుప్పట్ల పంపిణీ

రాజేంద్రనగర్: పెండ్యాల శ్రీనివాస్ 56వ జయంతి సందర్భంగా శుక్రవారం శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్యాల సాయి ఆధ్వర్యంలో బుద్వేల్ డైరీఫామ్, రాజేంద్రనగర్, ఆరాంఘర్ చౌరస్తాలో పేద ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్: చెరువు నీళ్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రషీద్‌గూడ గ్రామ శివారులో ఉన్న చామచెరువు నీళ్లలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రెండు మూడ్రోజుల క్రితం సదరు వ్యక్తి చెరువు నీళ్లల్లో మునిగి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో గుర్తు పట్టలేని విధంగా మారింది. మృతుడి ఒంటిపై నీలిరంగు టీషర్టు, బ్రౌన్ రంగు ప్యాంటు ఉన్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలంతా తమ ఓటుహక్కును ఉపయోగించుకునేలా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకుని తమ విధులను సక్రమంగా నిర్వహించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్వీప్ ఆక్టివిటీ నోడల్ ఆఫీసర్ శరత్‌చంద్ర వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధారణ ఎన్నికలు–2023లో భాగంగా ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్) పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు తగిన సూచనలు, సలహాలు, నియమాలను వివరించారు. బీఎల్‌ఓలు స్వయంగా ప్రతి ఇంటికెళ్లి సంబంధిత ఓటరుకు మాత్రమే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌ను అందించాలన్నారు. మరణించిన, మైగ్రేటెడ్ తదితర ఓటరు సమాచారాన్ని సేకరించి సంబంధిత సూపర్‌వైజర్లు ఆఫీసర్లకు ఇవ్వాలన్నారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్స్ పంపిణీ 22న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేయాలన్నారు. ఆఫీసర్లు బాధ్యత వహిస్తూ వారికి అప్పగించిన పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదన్నారు. ఓటరు శాతాన్ని పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వైన్‌షాపు ఏర్పాటును విరమించుకోవాలి

బండ్లగూడ: జనావాసాల మధ్య వైన్స్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అధికారులు వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ నాయకుడు, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బండ్లగూడ శిశుమందిర్ పాఠశాల ప్రాంతంలోని కృష్ణానగర్ కాలనీ ప్రధాన రహదారిపై కొత్తగా వైన్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. విషయం తెలుసుకుని స్థానికులతో కలిసి ఆయన వైన్స్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా వైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారని, అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ వైన్స్ ఏర్పాటుతో విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



బండ్లగూడలో నిర్మిస్తున్న షెడ్డు..



విజేతలకు కప్‌లను అందజేస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

క్రీడల్లో రాణించాలి

మణికొండ: యువతీ,యువకులు క్రీడలలో రాణించాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, హుడాకాలనీ ఎంజీ పార్కులో శుక్రవారం కందాడ రజినీకాంత్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు షీల్డ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మృతి చెందిన క్రీడాకారున్ని స్మరించుకునే కార్యక్రమంలో అతడికి ఇష్టమైన క్రీడాపోటీలను మూడు సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తోటి క్రీడాకారులు పాల్గొని అతని ఆత్మకు శాంతి కలిగేలా కోరుకోవాలన్నారు. క్రీడలతో మంచి సంబంధాలు ఏర్పడతాయన్నారు. పోటీలలో మొదటి స్థానంలో నిలిచిన సుధాకర్, చందులు, రెండోస్థానంలో నిలిచిన అన్సార్, శ్రీధర్‌రెడ్డి, మూడోస్థానంలో నిలిచిన నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌లకు ఆయన కప్‌లను అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌కుమార్, హుడాకాలనీ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, భాగ్యలక్ష్మికాలనీ అధ్యక్షుడు రాజలింగం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దేవరాజ్‌నాయుడు, కిషన్‌రెడ్డిలతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు జరుగవని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి, అధ్యాపకులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలన్నారు. విద్యార్థులకు చిన్నపటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావు, ప్రిన్సిపల్ ప్రభు, అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్ గుప్తా, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి సచ్చింద్రనాథ్‌తో పాటు దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బడుగుల అభ్యున్నతి

విజయనగర్‌కాలనీ: బడుగుల అభ్యున్నతి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నాంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్ష్మీనగర్, శాంతినగర్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో గడప గడపకూ వెళ్లి కారు గుర్తుకే ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఆయన వెంబడి సీహెచ్. లక్ష్మీనారాయణ, శీలం బాల్‌చందర్, సంజయ్, మల్లేపూల విద్యాసాగర్, రేణేశ్వర్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ పారిశ్రామికవాడలోని పరిశ్రమలలో పనిచేసే కార్మికులందరూ తప్పనిసరిగా ఓటువేయాలని మైలార్‌దేవ్‌పల్లి డీపీఓ అధికారి రాధారాణి కార్మికులకు వివరించారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామికవాడలో ఉన్న పారాగాన్ ఫుడ్ కంపెనీలో పనిచేస్తున్న మహిళ, నిరక్షరాసులకు ఈవీఎం ద్వారా ఓటును ఎలా వినియోగించుకోవాలో మెషిన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించాలని వారికి సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారమవుతామన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వాల్యానాయక్, శివకుమార్, కంపెనీ యాజమాన్యంతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టిగా రాష్ట్రం

అత్తాపూర్: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ దేశంలోనే ఆర్థిక పరిపుష్టికి కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, జాలిగం చిత్తారి అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతోష్ గౌడ్, చిన్న నరేందర్‌రావు, హరినాథ్, వనం శ్రీరాములు, రాము, రవీందర్, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రాజేంద్రనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉప్పర్‌పల్లి గ్రామంలో డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో గడప గడప ప్రచారం నిర్వహించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్ర మొదటి స్థానం, గొప్పదనాన్ని ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ప్రకాష్‌గౌడ్‌ను నాల్గోసారి దీవించాలని కోరారు. సీనియర్ నాయకులు చలసాని విష్ణుమూర్తి, జాన్‌పాల్, ప్రొఫెసర్ రవీందర్, సాయి మల్లిక్, ఓమర్, సుమలత, సుజాతగౌడ్, అంజమ్మ, జబీన్, హుస్సేన్, మాధవులు, బండ్ల నరేందర్, మలాకి దేవదాస్, శ్రీవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, పట్నం నరేష్, గిరి, రఘు, రాజేష్, భాను, ప్రసాద్, వీర్లపల్లి మహేష్, అక్కిరాజు సుబ్బారావు, నవీన్, కమల్ కుమార్, రజినీకాంత్‌గౌడ్, ఇద్రీస్, జనార్ధన్, రాఘవేందర్, ముజమ్మిల్ అహ్మద్, ప్రకాష్, అష్ఫాక్, పచ్చ శ్రీనివాస్, రఘుగౌడ్, ఓం ప్రకాష్‌గౌడ్, మణికంఠం, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మణికొండలో ఇంటింటి ప్రచారం..

మణికొండ: నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రకాష్‌గౌడ్ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగినందుకే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, రాబోయే రోజుల్లో మరింత వేగంగా ప్రగతి సాధించాల్సి ఉందని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ పార్టీ గండిపేట మండల సమన్వయ కర్త తలారి మల్లేష్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డిలు అన్నారు. శుక్రవారం వారు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఏకతాటిపై నడిపి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన ఘనత ప్రకాష్‌గౌడ్‌కే దక్కుతుందన్నారు. మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షురాలు లక్ష్మిశ్రీ, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హెచ్‌సీయూ-ధర్మవన నేచర్ ఆర్క్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: ధర్మవన నేచర్ ఆర్క్ ఫౌండేషన్‌తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భారతదేశంలో అరుదైన, అంతరించిపోతున్న మొక్కలు, జంతువుల సంరక్షణకు అంకితం చేయబడిన ఒక ఎన్‌జీఓ ప్రత్యేకించి హైదరాబాద్‌లో భాగమైన తూర్పు కనుమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. జీవావరణశాస్త్రం, జీవవైవిధ్య పరిరక్షణపై పరిశోధన సహకారం కోసం ఒప్పందం జరిగింది. ధర్మవన నేచర్ ఆర్క్ తెలంగాణలోని యాదాద్రి–భువనగిరి జిల్లాలో 400 ఎకరాల విస్తీర్ణంలో నెలకొంది. కార్యక్రమంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎన్ శివకుమార్, ప్లాంట్ సైన్సెస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్, ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధార్థన్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మభూషణ్ ఎ.ఆర్.కృష్ణకు ఘన నివాళి



నాంపల్లి: ఎ.ఆర్.కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహణలో పద్మ భూషణ్ ఎ.ఆర్.కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి శుభాశీస్సులతో కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో 'శ్రీకృష్ణ రాయబార ఘట్టం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా వేమన ఫౌండేషన్ చైర్మన్, విశ్రాంత ఐపీఎస్ అధికారి చెన్నూరి ఆంజనేయరెడ్డి హాజరయ్యారు. ప్రజా–పద్యం సంస్థ ద్వారా సామాజిక ఇతివృత్తాలపై రచించిన ఆధునిక తెలుగు సాంఘీక పద్య నాటక రచనా పోటీల్లోని విజేతలకు జీజీకే ఫౌండేషన్ ద్వారా అశ్విని గ్రూపు చైర్మన్ బీసీహెచ్‌వీ సుబ్బారావు సౌజన్యంతో నగదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.కృష్ణయ్య, సినీ నాటక రచయిత ఎం సంజీవి, జి.నెహ్రూ, ఏపీ నీలం, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత మేనేజింగ్ ట్రస్టీ దుగ్గిరాల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీతోనే ప్రజాభివృద్ధి

నాంపల్లి: ప్రజల అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. నాంపల్లి నియోజకవర్గంలో పలు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. మల్లేపల్లి పరిసర ప్రాంతాల్లో మజ్లిస్ అభ్యర్థి మాజీద్ హుస్సేన్‌తో కలిసి ఆయన ముమ్మరంగా పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం ఒవైసీ మాట్లాడుతూ.. మాజీద్ హుస్సేన్ 24/7 తరహాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. మాజీద్ హుస్సేన్‌ను గెలిపిస్తే నాంపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మజ్లిస్ పార్టీ అండగా ఉండి నిరంతరం వారి ప్రగతికి, వారి సంక్షేమానికి, వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

కార్వాన్‌లో అమర్‌సింగ్ పాదయాత్ర



ప్రచారంలో బీజేపీ కార్వాన్ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: బీజేపీని ఓడించడానికి బీఆర్‌ఎస్, మజ్లిస్ కుమ్మక్కైయ్యాయని అయితే వారు ఎన్ని కుట్రలు పన్నిన తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ కార్వాన్ నియోజవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తమ పబ్బంగడుపుకోవడానికే సీఎం కేసీఆర్ మజ్లిస్‌కు వంత పలుకుతున్నారని ఆరోపించారు. ఓట్లను చీల్చి బీజేపీని ఓడించడానికి మజ్లిస్ పార్టీ సీఎం కేసీఆర్ ఆదేశాలతో డమ్మి అభ్యర్థులను నిలబెట్టారని స్పష్టం చేశారు. మజ్లిస్ ఆగడాలకు చెక్ పెట్టాలంటే బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు.

8వ బెటాలియన్‌లో 'మిత్ర షేర్ అండ్ షైన్'

గచ్చిబౌలి: ప్రణాళికతో ముందుకు సాగాలని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ తెలిపారు. శుక్రవారం కొండాపూర్ 8వ బెటాలియన్‌లో మిత్ర షేర్ అండ్ షైన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి ప్రణాళికలు అవసరం, ఆశావాదం, కృతజ్ఞతా భావం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు దేవిదాసు రాథోడ్, రెహమాన్, నర్సింహ్మ స్వామి, సత్యనారాయణ, నారాయణ దాసు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సామిత్రి పబ్లికేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కూర చిదంబరం రచించిన జీవన చదరంగం, అనుభవాలు పాఠాలు అనే పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో జీవన స్థితిగతులపై రచయిత చక్కగా వివరించారని కొనియాడారు. శాసనమండలి సభ్యులు బొగ్గారపు దయానంద్, కవి విహారి, సాహితీవేత్త సుదామ, బైస దేవదాస్, అఖిలభారతీయ భాషా సమ్మేళన్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కె.సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.